# ఒడిశా నుంచి గంజాయి రవాణా

**డ్రైవర్ అరెస్టు.. రూ. 2.25 కోట్ల విలువైన గంజాయి సీజ్**

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి హైదరాబాద్, మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ. 2.23 కోట్ల విలువైన 710 కిలోల గంజాయిని మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సుభాష్ బిష్ణోయ్ డ్రైవర్. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు రాజస్థాన్‌లోని గంజాయి స్మగ్లర్లతో చేతులు కలిపాడు. ఒడిశా నుంచి హైదరాబాద్, మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇందులో భాగంగానే తన లారీలోని క్యాబిన్, బాడీకి మధ్య కొత్తగా మరో క్యాబిన్‌ను తయారు చేయించాడు. అందులో గంజాయి నింపి.. ఎవరికీ అనుమానం రాకుండా లారీలో తిరుగుతున్నాడు. 24వ తేదీన ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయితో వస్తున్నట్లు ఎస్ఓటీ మహేశ్వరం ఇన్‌స్పెక్టర్ రవి బృందానికి సమాచారం అందింది. దీంతో ఘట్‌కేసర్ పోలీసుల సహకారంతో ఎస్ఓటీ పోలీసులు ఘట్‌కేసర్‌లో లారీని ఆపి తనిఖీలు చేశారు. రహస్య క్యాబిన్ నుంచి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఓస్ఓటీ డీసీపీ మురళీధర్, ఏసీపీ మట్టయ్య, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్

## రూ. 50 లక్షల విలువైన హెరాయిన్ పట్టివేత

**ఎన్వలప్ కవర్లలో డెలివరీ.. నలుగురు అరెస్టు**



రాజస్థాన్ నుంచి హెరాయిన్ తెచ్చి ఎన్వలప్ కవర్లలో పెట్టి నగరంలో బైక్ సర్వీస్ ద్వారా సరఫరా చేస్తున్న ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన భన్వర్‌లాల్, మరో ఇద్దరు జువెనల్స్‌తో పాటు విష్ణు బిష్ణో ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా చెడు అలవాట్లకు బానిసయ్యారు. డ్రగ్స్‌కు అలవాటు పడి.. ఆ తరువాత డ్రగ్ విక్రేతలుగా మరారు. రాజస్థాన్‌లో తెలిసిన వారి వద్ద నుంచి హెరాయిన్‌ను కొనుగోలు చేస్తున్నారు. కొంత సొంతానికి వాడుకోవడంతో పాటు మరికొంత అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. హెరాయిన్ రవాణా చేసేందుకు బైక్ సర్వీస్‌లను ఉపయోగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ బృందం మీర్‌పేటలోని ఎన్‌బీఆర్ కాలనీలో ఈ నలుగురిని అరెస్టు చేసింది. వారి వద్ద నుంచి రూ. 50 లక్షల విలువైన 80 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ సరఫరాకు ఉపయోగిస్తున్న బైక్ సర్వీస్‌లపై దృష్టి పెట్టామని, ఎన్‌డీపీఎస్ యాక్టు నమోదైన వారిని బైక్ సర్వీస్‌లకు ఉపయోగించవద్దని ఆయా బైక్ సర్వీస్ యాప్ నిర్వాహకులకు సూచిస్తామని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఏసీపీ మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

### హోటల్ మేనేజర్ సహా మరో వ్యక్తి అరెస్ట్

ఒడిశా నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ నిఖితా పంత్ కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన సరోజ్‌కుమార్ దాస్ హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్న ఒరిస్ బార్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులున్నాయి. దీంతో స్నేహితుడైన సయ్యద్ ఫయాజ్‌తో గంజాయి దందాపై చర్చించాడు. ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి తెచ్చి.. నగరంలో విక్రయించేందుకు పథకం వేసి, గంజాయి తీసుకొచ్చారు. బోరబండ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అరెస్టుచేసి, వారి వద్ద నుంచి 1.7 కిలోల గంజాయి సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును బోరబండ పోలీసులకు అప్పగించారు.

# రూ. 34.5 లక్షల హవాలా డబ్బు పట్టివేత

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): హవాలా మార్గంలో డబ్బును తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 34.5 లక్షల నగదును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ నిఖితా పంత్ కథనం ప్రకారం.. శివరాంపల్లిలో నివాసముండే శివష్ణు రాయ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతడి వద్ద డ్రైవర్‌గా మహ్మద్ మన్సూర్ పనిచేస్తున్నాడు. ఇతడికి నల్లగుట్టకు చెందిన భవేశ్ కుమార్‌తో హవాలా సంబంధాలు ఉన్నాయి. పన్ను ఎగ్గొడుతూ అక్రమ పద్ధతిలో నగదు లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం శివష్ణురాయ్, భవేశ్ కుమార్ భారీగా నగదును పలువురి వద్ద నుంచి సేకరించారు. ఆ నగదును జీపులో దాచి, కిమ్స్ దవాఖాన వద్ద ఇతరులకు అప్పగించాలని శివష్ణురాయ్ తన డ్రైవర్‌కు సూచించాడు. నల్లగుట్టలో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా.. జీపులో రూ. 34.50 లక్షలు పట్టుబడ్డాయి. డ్రైవర్‌ను విచారించడంతో ఆదేశాలిచ్చిన వారి పేర్లు చెప్పాడు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, తదుపరి విచారణ నిమిత్తం రాంగోపాల్‌పేట పోలీసులకు అప్పగించారు.

### జగద్గిరిగుట్టలో..

జగద్గిరిగుట్ట: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదును జగద్గిరిగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆస్బెస్టాస్‌కాలనీలో సోమవారం జగద్గిరిగుట్ట పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ కారును ఆపి తనిఖీ చేయగా.. రూ.1.48 లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.



### దుండిగల్‌లో..

**దుండిగల్ :** దుండిగల్ పోలీసులు గండిమైసమ్మ చౌరస్తాలో సోమవారం మేడ్చల్ ఎస్ఓటీ బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. అరవింద్ సింగ్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై రూ.17.4లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

### చందానగర్‌లో రూ.99 లక్షలు..



కొండాపూర్ : చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని గంగారం ప్రధాన రహదారిలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 99 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో ఈ డబ్బును ఆధాయపన్ను శాఖ అధికారులకు అందజేసినట్లు పోలీసులు తెలిపారు.



## నామినేషన్ సెంటర్ల వద్ద నాలుగంచెల భద్రత

- నోడల్ అధికారులుగా ఏసీపీలు
- ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- సమన్వయ సమావేశంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను దృష్టిలో పెట్టుకుని పోలీసులు బందోబస్తుపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా నామినేషన్ కేంద్రాల చుట్టూ నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. సోమవారం కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీపీ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున అభ్యర్థులు, వారి అనుచరులు వచ్చే అవకాశం ఉంటుందని, ఇది దృష్టిలో పెట్టుకుని సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచించారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి ఇచ్చే అంశాలలో ఆర్ఓలను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా డబ్బు, మద్యం, ఓటర్లను మభ్యపెట్టే ఇతర వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో కేంద్ర బలగాల సహాయం తీసుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ అదనపు సీపీ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ (ట్రాఫిక్) కె.నారాయణ్ నాయక్, బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, మేడ్చల్ డీసీపీ శబరీష్, మాదాపూర్ డీసీపీ సందీప్, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ డీసీపీలు అశోక్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లాడ్జిలో యువకుడి దారుణహత్య

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 30 : లాడ్జి గదిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ కథనం ప్రకారం.. ఏలూరుకు చెందిన నవీన్ (26), కర్ణాటకకు చెందిన ప్రవీణ్ స్నేహితులు. ఆదివారం ఉదయం కేపీహెచ్‌బీ కాలనీలోని ఎస్ఎస్ రెసిడెన్సీ లాడ్జిలో నవీన్ ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. మధ్యాహ్నం ఆ గదిలోకి ప్రవీణ్ వచ్చాడు. ఇద్దరు కలిసి మద్యం సేవించారు. సోమవారం ఉదయం గదిని చెక్ ఔట్ చేసే సమయానికి ఎవరూ బయటికి రాకపోవడంతో లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చింది. గదిని తెరిచి చూడగా.. బెడ్‌పై నవీన్ హత్యకు గురై ఉన్నాడు. కత్తితో మెడ కోసి హత్య చేశారు. నవీన్‌తో పాటు మద్యం తాగిన ప్రవీణ్ హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## బాలికతో అసభ్యప్రవర్తన.. ఐదేండ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): బాలికను తన షాపులోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడు కొంపల్లి మనోహర్ (52)కు ఐదేండ్ల జైలుశిక్ష, పదివేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు మూడు లక్షల నష్టపరిహారం అందజేయాలని న్యాయసేవా సంస్థను ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. అదనపు పీపీ కోమలత కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ ఇంజాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు మనోహర్ మ్యాచింగ్ సెంటర్ నడుపుతున్నాడు. 2022, సెప్టెంబర్ 20న బాధిత బాలిక తన సోదరుడితో కలిసి వెళ్తుండగా.. నిందితుడు బాలిక చేయిపట్టి షాపులోకి తీసుకువెళ్లి.. షట్టర్ మూసివేశాడు. గమనించిన స్థానికులు షట్టర్ తలుపులు బాదడంతో బయటకు వచ్చాడు. జరిగిన ఘటనపై బాలిక తల్లి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్టిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.